మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310


## కర్నూలులో ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు



3లో..


ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 242 | శనివారం | 14 - 03 - 2026 | పేజీలు: 8 | వెల: 4


## గ్యాస్ అప్‌డేట్ పేరుతో

# సైబర్ మోసం


- ఇద్దరు మహిళల ఖాతాల నుంచి నాలుగు లక్షలు మాయం
- నకిలీ ఫైల్ పంపించి వివరాలు సేకరించిన నేరగాళ్లు
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



మన గళం డెస్క్ : వంట గ్యాస్ కొరత పరిస్థితిని ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఇద్దరు మహిళలను లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు వారి బ్యాంకు ఖాతాల నుంచి సుమారు నాలుగు లక్షల రూపాయలు దోచుకున్నారు. గ్యాస్ కనెక్షన్ వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉందని చెప్పి ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కల్యాణ్-డోంబివ్లి ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మహానగర్ గ్యాస్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులమని పరిచయం చేసుకున్నారు. గ్యాస్ సిలిండర్ కనెక్షన్ వివరాలను నవీకరించుకోవాలని చెప్పి వారి మొబైల్ ఫోన్లకు ఒక ఫైల్ పంపించారు. ఆ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసి తెరవాలని సూచించారు. అంతటితో ఆగకుండా ఒక ఆన్‌లైన్ ఫారమ్ పూరించాల్సిందిగా

2 లో..







## ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణ స్వీకారం

– ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయింపు

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ న్యాయరంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు మరియు ప్రముఖులు హాజరయ్యారు. జస్టిస్ లిసా గిల్ నియామకం రాష్ట్ర న్యాయ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి. న్యాయరంగంలో ఆమెకు ఉన్న అనుభవం, సేవలను దృష్టిలో పెట్టుకుని ఈ

2 లో..

## అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు పనులపై సమీక్ష

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డుకు సంబంధించిన పనులను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉండవల్లి వద్ద బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మిస్తున్న ఆధునిక స్టీల్ బ్రిడ్జ్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రాజధాని ప్రాంతానికి మెరుగైన రహదారి అనుసంధానంపై మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. సీడ్ యాక్సెస్ రోడ్డును మంగళగిరి ప్రధాన రహదారితో అనుసంధానించేందుకు ఇంకా సుమారు 4.5 ఎకరాల భూమికి సంబంధించిన సమస్య పెండింగ్‌లో ఉందని మంత్రి తెలిపారు. ఈ భూమి సేకరణకు ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ రైతులకు మరో నెల రోజుల గడువు ఇస్తున్నట్లు

2 లో..



## అమరావతిలో బిట్స్ ఏఐ క్యాంపస్ నిర్మాణంపై లోకేష్ సమీక్ష



- బిట్స్ ప్రతినిధులతో మంత్రి భేటీ
- ఏఐ, డేటా సైన్స్ వంటి ఆధునిక కోర్సులు

2 లో..

## జిల్లా పోలీసు కార్యాలయంలో మొల్ల జయంతి వేడుకలు



- తొలి తెలుగు కవయిత్రికి ఘన నివాళి
- మొల్ల సాహిత్య సేవలను స్మరించిన పోలీసులు
- సాహిత్యంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచన

శ్రీకాకుళం, 13 మార్చి ,మన గళం,: తెలుగు సాహిత్యానికి విశిష్ట సేవలు అందించిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలను శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ

2 లో..

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

- కడప స్టీల్ ప్లాంట్‌కు భూ కేటాయింపు - గిరిజన రైతులకు భారీ సబ్సిడీలు - జల జీవన్ మిషన్‌కు వేల కోట్ల ఆమోదం

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు భూకేటాయింపులు, గిరిజన రైతులకు సబ్సిడీలు, ఉద్యోగినుల కోసం హాస్టళ్లు వంటి అనేక ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు ఈ వివరాలను వెల్లడించారు. రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పరిధిలోని పలు గ్రామాల్లో 424.45 ఎకరాల ప్రభుత్వ భూమిని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థకు కేటాయించేందుకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. రూ.21.30 కోట్ల చెల్లింపుతో ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించి, రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అదనంగా కిమ్స్ ఆసుపత్రి, విద్యాసంస్థలు, పర్యాటక అభివృద్ధి, ఈఎస్ఐసీ ఆసుపత్రి నిర్మాణం కోసం పలు ప్రాంతాల్లో భూములను కేటాయించారు.



గిరిజన రైతులకు ఊరట కల్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అటవీ హక్కు పత్రాలు ఉన్న రైతులకు 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. కొండ ప్రాంతాల్లో సాగు చేసే రైతులకు నీటి వనరుల సమస్యను తగ్గించి దిగుబడులు పెంచేందుకు ఈ చర్యలు దోహదపడనున్నాయి. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నీటి కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం-2024ను రాష్ట్రంలో అమలు చేసేందుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. చిన్న ఉల్లంఘనలకు జైలు శిక్షల స్థానంలో జరిమానాలు విధించేలా ఈ చట్టంలో మార్పులు చేయనున్నారు. దీంతో పరిశ్రమలపై భారం తగ్గడంతో పాటు కేంద్ర నిధులు పొందే అవకాశం కూడా ఉంటుంది.

ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ హాస్టళ్లలో సురక్షిత వసతులతో పాటు చిన్న పిల్లల కోసం శిశు

2 లో..

## గ్యాస్ అప్‌డేట్ పేరుతో

# సైబర్ మోసం




మహిళలకు సూచించారు. వారు ఆ ప్రక్రియ పూర్తి చేసిన కొద్ది సేపటికే వారి బ్యాంకు ఖాతాల నుంచి సుమారు నాలుగు లక్షల రూపాయలు డెబిట్ అయినట్లు సందేశాలు వచ్చాయి. దీంతో మోసపోయామని గుర్తించిన మహిళలు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. బాధితులు డోంబివ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసు అధికారి సుహాస్ హెమాడే తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్ కొరతపై ప్రజల్లో ఉన్న ఆందోళనను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని ఆయన చెప్పారు. ప్రజలు ఇలాంటి ఫోన్ కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. తెలియని వ్యక్తులు పంపిన ఫైళ్లను డౌన్‌లోడ్ చేయకూడదని, వ్యక్తిగత లేదా బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు.

## ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణ స్వీకారం



బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఈ ఏడాది ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన పదవీ విరమణ అనంతరం జస్టిస్ లిసా గిల్ ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చరిత్రలో తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. ఈ నియామకం ద్వారా ఏపీ హైకోర్టులో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరుగుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో న్యాయ వ్యవస్థలో మరిన్ని సానుకూల మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు.

## అమరావతిలో బిట్స్ ఏఐ క్యాంపస్ నిర్మాణంపై లోకేష్ సమీక్ష

అమరావతి, 13 మార్చి ,మనగళం: అమరావతిలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పిలాని ఏఐ ప్లస్ క్యాంపస్ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలను విద్య, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పరిశీలించారు. బిట్స్ ప్రతినిధులు సిద్ధార్థ బెనర్జీ, ఎన్ చెన్నవీర్, బీఎస్ సహాని శుక్రవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి అమరావతి క్యాంపస్ నిర్మాణ ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా బిట్స్ ప్రతినిధులు మాట్లాడుతూ అమరావతి క్యాంపస్‌లో కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ భాషాశాస్త్రం, సైబర్ భౌతిక వ్యవస్థలు వంటి ఆధునిక కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. భవిష్యత్తు సాంకేతిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ కోర్సులను రూపొందిస్తున్నామని చెప్పారు. రెండు దశల్లో అమలు చేసే ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు ఏడువేల మంది విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించనున్నట్లు బిట్స్ ప్రతినిధులు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఈ క్యాంపస్ అభివృద్ధికి సుమారు వెయ్యి కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. అమరావతిలో విద్యా రంగాన్ని బలోపేతం చేసే ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు ప్రభుత్వం సహకరించాలని బిట్స్ ప్రతినిధులు మంత్రి లోకేష్‌ను కోరారు. రాష్ట్రంలో ఉన్నత విద్యా అవకాశాలను పెంచేందుకు ఈ క్యాంపస్ కీలకంగా మారుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

సంరక్షణ కేంద్రాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగినులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఈ హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నారు. జీఎస్టీ వివాదాల పరిష్కారానికి విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలో మూడు అప్పిలేట్ ట్రైబ్యునల్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. దీనివల్ల కేసులు త్వరగా పరిష్కారమై రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం సకాలంలో అందుతుందని ప్రభుత్వం భావిస్తోంది. జల జీవన్ మిషన్ పథకం అమలుకు రూ.9,355 కోట్ల విలువైన ఏడు ప్రాజెక్టులకు పరిపాలన ఆమోదం ఇచ్చింది. అదనంగా 3000 నివాస ప్రాంతాలకు రూ.1,814.71 కోట్లతో తాగునీటి పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 76 మండలాల్లోని సుమారు 65 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

రాష్ట్రంలో మూడు కొత్త కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ, ఏలూరు జిల్లా నూజివీడు, శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతాల్లో భూములను కేటాయించారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు మూడో గ్యాంట్రీ క్రేన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రాజెక్టు పనుల కోసం అదనంగా రూ.47 కోట్లకు పైగా వ్యయానికి మంత్రివర్గం అనుమతి తెలిపిందని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.




# అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు పనులపై సమీక్ష




వెల్లడించారు. ఏప్రిల్ 9 నాటికి రైతులు స్వచ్ఛందంగా భూసమీకరణకు ముందుకు రాకపోతే ప్రభుత్వం తప్పనిసరిగా భూసేకరణ చేపట్టాల్సి వస్తుందని మంత్రి స్పష్టం చేశారు. రాజధాని అభివృద్ధి కోసం రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ నెలాఖరుకల్లా పనులు పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థలు హామీ ఇచ్చినట్లు చెప్పారు. అలాగే గుంటూరు ఛానల్, కొండవీటి వాగులపై మరో రెండు స్టీల్ బ్రిడ్జిలు నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ రెండు బ్రిడ్జిలు కూడా పూర్తయితే సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని ప్రాంతానికి మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

## కర్నూలు జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో ఘనంగా జరిగిన శ్రీ ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు




మన గళం కర్నూలు: కర్నూలు జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో శ్రీ ఆతుకూరి మొల్ల మాంబ జయంతి ఉత్సవం కార్యక్రమం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ విచ్చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె 1440 మార్చి 13న, ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా గోపవరం గ్రామంలో ఆటుకూరి కేశన శెట్టికి జన్మించారు. ప్రసిద్ధ రచన: మొల్ల రచించిన అత్యంత ప్రసిద్ధ గ్రంథం “మొల్ల రామాయణం“. ఇది సరళమైన తెలుగు పద్యాలతో, సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా అందించారు ప్రతి సంవత్సరం మార్చి 13న, హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద ఉన్న మొల్ల విగ్రహంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఆమె జయంతిని ఘనంగా నిర్వహిస్తారు.

వీరు శ్రీశైల మల్లయ్య భక్తురాలైన మొల్ల, తన కవిత్వంలో సరళతకు, భక్తికి ప్రాధాన్యత ఇచ్చారు వీరు తెలుగు మహిళా సాహితీవేత్తలకు, యువతకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ మరియు ఉప్పరి రామ గిడ్డయ్య రాష్ట్ర సగర కార్పొరేషన్ ఉప్పర డైరెక్టర్ మరియు శాలివాహన కుల నాయకులు అన్ని కుల సంఘాల నాయకులు పాల్గొనడం జరిగినది.

# సామూహిక మరుగుదొడ్ల స్థలం ఆక్రమిస్తే కఠిన చర్యలు

**- డిప్యూటీ ఎండిఓ హరుణ్ రషీద్. - మొలగవల్లి 5వ వార్డులో స్థలాన్ని పరిశీలించిన అధికారులు.**

(ఆలూరు మనగళం): ఆలూరు మండలం, మొలగవల్లి గ్రామంలోని 5వ వార్డు పరిధిలో ఉన్న సామూహిక మరుగుదొడ్ల స్థలం ఆక్రమణకు గురవుతుందన్న కాలనీవాసుల ఆందోళనల నేపథ్యంలో అధికారులు స్పందించారు. శుక్రవారం డిప్యూటీ ఎండిఓ హరుణ్ రషీద్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ నాయుడు కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎండిఓ హరుణ్ రషీద్ మాట్లాడుతూ, సామూహిక మరుగుదొడ్ల స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే నిధులు సమీకరించి స్థలాన్ని సర్వే చేసి రాళ్లు పాతి కంచె ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే మొలగవల్లి గ్రామ పరిధిలో పంచాయతీకి చెందిన ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే వాటిని వెంటనే స్వాధీనం చేసుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.




## జిల్లా పోలీసు కార్యాలయంలో మొల్ల జయంతి వేడుకలు

కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి. రమణ పాల్గొని మొల్ల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మొల్ల జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఈ వేడుకలను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మొల్ల తెలుగు సాహిత్యానికి అందించిన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మొల్ల కవిత్వానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆమె రచనలు తెలుగు భాషకు అమూల్యమైన సంపదగా నిలిచాయని చెప్పారు. మహిళల్లో చైతన్యం, జాగృతి కలిగించడంలో మొల్ల రచనలు కీలక పాత్ర పోషించాయని కొనియాడారు. గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని సాహిత్యంపై ఆసక్తి పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ గోపీనాథ్, సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐ నర్సింగరావు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# కర్నూలులో ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు




కర్నూలు నగరం, మార్చి 13,మనగళం: కర్నూలు జిల్లా భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో, జిల్లా కుమ్మర సంక్షేమ సంఘం సహకారంతో తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని శరీన్ నగర్‌లో ఉన్న శాలివాహన నిర్మాణ కళ్యాణ మండప ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది.

మొల్ల సేవలు చిరస్మరణీయం

ఈ సందర్భంగా మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జిల్లా రాదీజ మోర్చ అధ్యక్షులు ఉల్చాల లక్ష్మణ్ నాయుడు గారు మాట్లాడుతూ మాట్లాడారు. తెలుగు సాహితీ వనంలో మొల్ల రామాయణం ద్వారా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మొల్ల, మహిళా లోకానికే గర్వకారణమని కొనియాడారు. ఆమె పట్టుదల మరియు సాహిత్య కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ఈ వేడుకలో పలువురు ముఖ్య నాయకులు పాల్గొని మొల్ల చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు:

బంగారప్ప: ఓబీసీ మోర్చా జోనల్ ఇంచార్జి

అశోక్: జిల్లా ఇంచార్జి

నాగన్న: జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షులు

వీరితో పాటు జిల్లా ఓబీసీ మోర్చా కార్యకర్తలు, జిల్లా కుమ్మరి సంఘం నాయకులు, సభ్యులు మరియు శాలివాహన కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కవయిత్రి మొల్ల జయంతిని అధికారికంగా, ఉత్సాహంగా జరుపుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# ఆలూరులో బిజెపి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ మరియు పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో..

- విజయవంతమైన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ సభ.
- బీజేపీ పార్టీ సిద్ధాంతలకు కట్టుబడి పనిచేస్తా... గుమ్మనూరు నారాయణ.




(ఆలూరు మనగళం): ఆలూరు మండల కేంద్రంలో శ్రీ వాసవి కల్యాణ మండపంలో కర్నూలు జిల్లా బిజెపి అధ్యక్షుడు రామకృష్ణ మరియు పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ సభలో ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ మరియు బిజెపి నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం అభివృద్ధికి పరుగులు పట్టే కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది. అనంతరం పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ, గుమ్మనూరు నారాయణకు మరియు ఆలూరు నియోజకవర్గం బిజెపి నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ బీజేపీ పార్టీ బలోపేతానికి నావంతు కృషి చేస్తాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో




బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నదాత - సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న బొజ్జమ్మ




(ఆలూరు మనగళం): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న "అన్నదాత సుఖీభవ" పథకం నిధుల విడుదల కార్యక్రమం శుక్రవారం కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ళ గ్రామంలో జరిగింది. గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ళ బొజ్జమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు మరియు గ్రామ ప్రజలతో కలిసి నిధుల విడుదల కార్యక్రమాన్ని వీక్షించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని,రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని బొజ్జమ్మ పేర్కొన్నారు. రైతులకు అందిస్తున్న ఆర్థిక సహాయం వల్ల వ్యవసాయ కార్యకలాపాలు మరింత బలపడతాయని, రైతులు ఈ పథకాల ప్రయోజనాన్ని పూర్తిగా పొందాలని ఆమె సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆడోబ్ సీఈవోగా తప్పుకోనున్న శంతను నారాయణ్..



క్యాలిఫోర్నియా మార్చి 13 మనగళం: అమెరికాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ సంస్థ ఆడోబ్ సీఈవో పదవి నుంచి భారతీయ మూలాలు కలిగిన శంతను నారాయణ్ తప్పుకోనున్నారు. త్వరలోనే ఆయన సీఈవో బాధ్యతల నుంచి వైదొలుగుతారని కంపెనీ అధికారికంగా ప్రకటించింది. అయితే కొత్త సీఈవో నియామకం పూర్తయ్యే వరకు శంతను తన పదవిలో కొనసాగుతారని సంస్థ వెల్లడించింది. 2007 డిసెంబర్‌లో శంతను నారాయణ్ ఆడోబ్ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. దాదాపు 18 సంవత్సరాల పాటు కంపెనీకి నాయకత్వం వహించిన ఆయన సంస్థను ప్రపంచంలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఒకటిగా నిలిపారు. కొత్త సీఈవో బాధ్యతలు స్వీకరించిన తర్వాత శంతను నారాయణ్ ఆ పదవిని విడిచిపెట్టనున్నారు. అయితే ఆయన పూర్తిగా కంపెనీ నుంచి దూరం కావడం లేదని స్పష్టం చేశారు. సీఈవో పదవిని మాత్రమే వదిలి, ఆడోబ్ బోర్డ్ చైర్మన్‌గా కొనసాగుతానని తెలిపారు. కంపెనీతో తన అనుబంధం కొనసాగుతుందని, సంస్థ అభివృద్ధికి భవిష్యత్తులో కూడా పని చేస్తానని ఉద్యోగులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. శంతను నారాయణ్ సీఈవో పదవిని వదిలే ఖచ్చితమైన కారణాలు అధికారికంగా వెల్లడించలేదు. అయితే ప్రస్తుతం కృత్రిమ మేధస్సు రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆడోబ్ భవిష్యత్తు వ్యూహాలపై కొత్త నాయకత్వం అవసరమని పెట్టుబడిదారులు భావించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల శంతను నారాయణ్‌పై ప్రశంసలు కురిపించారు. ఆయనను ఒక లెజెండ్‌గా అభివర్ణిస్తూ ఆడోబ్‌ను ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన సాఫ్ట్‌వేర్ సంస్థగా తీర్చిదిద్దిన నాయకుడని కొనియాడారు. క్రియేటర్లు, వ్యాపార సంస్థలు మరియు బ్రాండ్‌లకు ఆడోబ్ ఎంతో కీలకమైందని నాదెళ్ల పేర్కొన్నారు. ఆయనతో ఉన్న స్నేహానికి, మార్గదర్శకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

శంతను నారాయణ్ నాయకత్వంలో ఆడోబ్ సంస్థ గణనీయమైన పురోగతి సాధించింది. ఆయన బాధ్యతలు చేపట్టే సమయంలో కంపెనీలో సుమారు 3,000 మంది ఉద్యోగులు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 30,000కు పైగా పెరిగింది. అలాగే కంపెనీ విలువ కూడా భారీగా పెరిగింది. 1998లో ఆడోబ్ సంస్థలో చేరిన శంతను నారాయణ్ భారతదేశంలో జన్మించారు. ఆయన హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం అమెరికాలోని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఎంబీఏ చదివారు. ఆ తర్వాత పలు సంస్థల్లో పని చేసి ఆడోబ్‌లో చేరారు. ప్రస్తుతం 62 ఏళ్ల వయసులో కూడా ఆయన టెక్నాలజీ రంగంలో ప్రభావవంతమైన నాయకుడిగా కొనసాగుతున్నారు.

## నారీ శక్తి కార్యక్రమంలో మహిళా భద్రతపై అవగాహన

శ్రీకాకుళం, 13 మార్చి ,మనగళం): శ్రీకాకుళం జిల్లా పోలీసులు నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలు, పిల్లల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలపై వేధింపులు, గృహహింస, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలు, సైబర్ నేరాలు వంటి అంశాలపై పోలీసు అధికారులు ప్రజలకు వివరించారు. అదేవిధంగా పిల్లల భద్రతకు సంబంధించిన గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. మహిళలు మరియు పిల్లలు తమకు ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. అప్రమత్తంగా ఉండడం ద్వారా అనేక నేరాలను నివారించవచ్చని తెలిపారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను కూడా కార్యక్రమంలో వివరించారు. చెడు వ్యసనాల కారణంగా వ్యక్తిగత జీవితం, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పోలీసు అధికారులు కోరారు. జాగ్రత్త, చైతన్యం, సమైక్యతతో సమాజాన్ని సురక్షితంగా మార్చుకోవాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు. మహిళా సాధికారత, మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు తెలిపారు.

# నష్టాల్లో ముగిసిన మార్కెట్లు.. సెన్సెక్స్ 1,470, నిఫ్టీ 488 పాయింట్లు పతనం

ముంబై మార్చి 13,మనగళం : భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల పెరుగుదల మరియు విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాల ప్రభావంతో మార్కెట్ సూచీలు గణనీయంగా పడిపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,470 పాయింట్లు పడిపోయి 74,563.92 వద్ద ముగిసింది. అదే సమయంలో నిఫ్టీ కూడా 488 పాయింట్లు తగ్గి 23,151.10 వద్ద స్థిరపడింది. శుక్రవారం ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 75,450 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రారంభంలోనే మార్కెట్ బలహీనంగా కనిపించి సుమారు 600 పాయింట్ల వరకు పడిపోయింది. అనంతరం అమ్మకాలు మరింత పెరగడంతో సూచీ మరింత క్షీణించింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా ఉదయం 150 పాయింట్ల నష్టంతో 23,450 వద్ద ప్రారంభమై తర్వాత భారీగా క్షీణించింది. అంతర్జాతీయ మార్కెట్లలో కూడా ఇదే ధోరణి కనిపించింది. దక్షిణ కొరియా కోస్పి సూచీ, జపాన్ నిక్కే 225, చైనా షాంఘై కాంపోజిట్ సూచీ, హాంకాంగ్ హాంగ్ సెంగ్ సూచీలు అన్నీ నష్టాల్లోనే ముగిశాయి. అమెరికాలోని వాల్ స్ట్రీట్ మార్కెట్లు కూడా గత ట్రేడింగ్ సెషన్‌లో స్వల్ప నష్టాలను చవిచూశాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరగడం కూడా మార్కెట్‌పై ప్రభావం చూపింది. క్రూడాయిల్ ధరలు 0.49 శాతం పెరిగి బ్యారెల్‌కు 101 డాలర్లకు చేరుకున్నాయి. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు చమురు మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.



# యూపీఐ వినియోగదారులకు కొత్త మోసం ముప్పు




న్యూఢిల్లీ, మార్చి 13,మనగళం: దేశంలో డిజిటల్ చెల్లింపులు విస్తృతంగా పెరుగుతున్న నేపథ్యంలో యూపీఐ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని సరికొత్త మోసం వెలుగులోకి వచ్చింది. మొబైల్ ఫోన్‌లలో ప్రత్యేక టూల్‌కిట్‌ను ఉపయోగించి కొద్ది క్షణాల్లోనే బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసే ప్రమాదం ఉందని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా యూపీఐ వ్యవస్థ మొబైల్ ఫోన్‌లో ఉన్న సిమ్ కార్డు ఆధారంగా బ్యాంకు ఖాతాను అనుసంధానం చేసిన తర్వాతే చెల్లింపులను అనుమతిస్తుంది. అయితే కొత్త తరహా మోసాల్లో ఈ భద్రతా వ్యవస్థను కూడా దాటేసే విధానాన్ని మోసగాళ్లు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. సైబర్ భద్రత సంస్థ క్లౌడ్‌సెక్ విడుదల చేసిన నివేదికలో “డిజిటల్ లూటేరా” అనే టూల్‌కిట్ గురించి వివరించింది. ఈ టూల్‌కిట్ మొబైల్ ఫోన్‌లోని చెల్లింపు వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని పని చేస్తుంది. ఫోన్‌లోని ఆపరేటింగ్ వ్యవస్థ స్థాయిలో మార్పులు చేసి భద్రతా తనిఖీలను తప్పించుకుంటుంది. బ్యాంకింగ్ లేదా చెల్లింపు అనువర్తనాల్లో మార్పులు చేయకుండా కూడా వినియోగదారుడి యూపీఐ ఖాతాను మరో పరికరంలో నమోదు చేసి నియంత్రించే అవకాశం ఉండటమే దీనిలో ప్రధాన ప్రమాదంగా నిపుణులు పేర్కొన్నారు. ఈ మోసం సాధారణంగా నకిలీ సందేశాలు లేదా అనుమానాస్పద ఫైళ్ల ద్వారా ప్రారంభమవుతుంది. ట్రాఫిక్ జరిమానా నోటీసు, వివాహ ఆహ్వానం వంటి రూపంలో కనిపించే ఫైల్‌ను బాధితుడికి పంపిస్తారు. వినియోగదారు దానిని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేస్తే ఆ అనువర్తనం సందేశాలపై అనుమతులు పొందుతుంది. తర్వాత హ్యాకర్లు ప్రత్యేక సాంకేతిక పద్ధతుల ద్వారా ఫోన్‌లోని గుర్తింపు వ్యవస్థను మార్చి బ్యాంకుకు వెళ్లాల్సిన నమోదు సందేశాలను మధ్యలోనే అడ్డుకుంటారు. అలాగే ఓటీపీ వివరాలను తమ నియంత్రణలో ఉన్న మార్గాలకు పంపించుకునే విధంగా వ్యవస్థను మార్చేస్తారు. దీంతో బాధితుడి సిమ్ అదే ఫోన్‌లో ఉన్నప్పటికీ యూపీఐ ఖాతాను మరో పరికరంలో నమోదు చేసి లావాదేవీలు చేయగల అవకాశముంటుంది. మునుపటి మోసాల్లో సాధారణంగా బ్యాంకింగ్ అనువర్తనాల్లో మార్పులు చేసి మోసాలకు పాల్పడేవారు. అందువల్ల వాటిని గుర్తించడం కొంత సులభంగా ఉండేది. అయితే కొత్త విధానంలో ఆపరేటింగ్ వ్యవస్థ స్థాయిలో మార్పులు జరగడం వల్ల భద్రతా వ్యవస్థలకు గుర్తించడం కష్టమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతి నెల కోట్ల సంఖ్యలో లావాదేవీలు జరిగే యూపీఐ వ్యవస్థలో సిమ్ ఆధారిత భద్రత ముఖ్యమైనదిగా భావిస్తారు. కానీ ఇలాంటి పద్ధతులు వినియోగిస్తే ఓటీపీ వివరాలను పట్టుకోవడం, యూపీఐ పిన్‌ను మార్చడం, వెంటనే మోసపూరిత లావాదేవీలు చేయడం సాధ్యమవుతుందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. తెలియని ఫైళ్లను డౌన్‌లోడ్ చేయకూడదని, అనుమానాస్పద లింకులు లేదా సందేశాలను తెరవకూడదని హెచ్చరిస్తున్నారు. బ్యాంకింగ్ లేదా యూపీఐకు సంబంధించిన ఓటీపీ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. మొబైల్ ఫోన్‌లో అనువర్తనాలకు ఇచ్చే అనుమతులను జాగ్రత్తగా పరిశీలించడం కూడా అవసరమని తెలిపారు. యూపీఐ వ్యవస్థకు బలమైన భద్రతా వ్యవస్థలు ఉన్నప్పటికీ వినియోగదారుల అప్రమత్తత అత్యంత కీలకమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# రూ.49,999కే టీవీఎస్ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్




న్యూఢిల్లీ, మార్చి 13 ,మనగళం: దేశంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల మార్కెట్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రముఖ వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసింది. ఆర్బిటర్ విఒకటి పేరుతో వచ్చిన ఈ మోడల్ ప్రారంభ ధర రూ.49,999గా నిర్ణయించారు. బ్యాటరీని వాహన ధర నుంచి వేరు చేసే ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెట్టడంతో స్కూటర్ ప్రారంభ ధరను తక్కువగా ఉంచగలిగామని కంపెనీ తెలిపింది. రోజువారీ నగర ప్రయాణాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ స్కూటర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు మరింత మంది వినియోగదారులను ఆకర్షిస్తుందని సంస్థ భావిస్తోంది. ఈ స్కూటర్‌లో ఒకటి దశాంశం ఎనిమిది కిలోవాట్ గంటల సామర్థ్యం గల బ్యాటరీ ఉంటుంది. ఒకసారి పూర్తిగా చార్జ్ చేస్తే సుమారు ఎనభై ఆరు కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని కంపెనీ పేర్కొంది. చార్జింగ్ కూడా వేగంగా పూర్తవుతుంది. శూన్యం నుంచి ఎనభై శాతం వరకు చార్జ్ కావడానికి సుమారు రెండు గంటల ఇరవై నిమిషాలు పడుతుందని తెలిపింది. రోజువారీ కార్యాలయ ప్రయాణాలు లేదా నగర పరిధిలో చిన్న దూరాల ప్రయాణాలకు ఇది అనుకూలంగా ఉంటుంది. డిజైన్ పరంగా కూడా ఈ స్కూటర్‌ను వినియోగదారుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించారు. ఫ్లాట్ ఆకృతిలో ఉన్న ఎనిమిది వందల నలభై ఐదు మిల్లీమీటర్ల సీటు రైడర్, వెనుక కూర్చునే వ్యక్తికి సౌకర్యంగా ఉంటుంది. రెండు వందల తొంభై మిల్లీమీటర్ల నిటారుగా ఉన్న ఫుట్‌బోర్డ్ సరిపడా కాళ్లకు స్థలాన్ని ఇస్తుంది. విస్తృత హ్యాండిల్‌బార్ సౌకర్యవంతమైన డ్రైవింగ్ స్థితిని అందిస్తుంది. అదనంగా ముప్పై నాలుగు లీటర్ల అండర్ సీట్ నిల్వ స్థలం ఉండడంతో రెండు హెల్మెట్లను కూడా ఉంచుకోవచ్చు. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌లో అనేక స్మార్ట్ మరియు భద్రతా ఫీచర్లు కూడా ఉన్నాయి. మొబైల్ అనువర్తనంతో అనుసంధానం అవడం వల్ల వినియోగదారులు బ్యాటరీ స్థితి, ప్రయాణ వివరాలు వంటి సమాచారాన్ని దూరం నుంచే చూడవచ్చు. ప్రమాద సూచన, పడిపోవడం గుర్తింపు, దొంగతనం నిరోధక వ్యవస్థ వంటి భద్రతా లక్షణాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే ప్రాంత పరిమితి నియంత్రణ, సమయ పరిమితి నియంత్రణ వంటి సౌకర్యాలు కూడా కల్పించారు. డిజిటల్ ప్రదర్శన ప్యానెల్ కాల్‌లు, సందేశాల సమాచారాన్ని కూడా చూపిస్తుంది.

రైడింగ్‌ను మరింత సులభతరం చేయడానికి ఈ స్కూటర్‌లో ఎత్తైన ప్రాంతాల్లో నిలిపే సహాయక వ్యవస్థ, క్రూజ్ నియంత్రణ, పార్కింగ్ సహాయక వ్యవస్థ వంటి ఆధునిక సాంకేతికతలు ఉన్నాయి. ఎకో మరియు పవర్ అనే రెండు రైడింగ్ విధానాలు కూడా అందుబాటులో ఉన్నాయి. బ్రేక్ వేస్తే బ్యాటరీకి మళ్లీ శక్తిని అందించే పునరుత్పత్తి బ్రేకింగ్ వ్యవస్థను కూడా ఇందులో అమర్చారు. అలాగే వైర్‌లెస్ విధానంలో సాఫ్ట్‌వేర్ నవీకరణలను పొందే సౌకర్యం కూడా ఉంది.

బ్యాటరీ సేవ విధానం ప్రకారం స్కూటర్ కొనుగోలు సమయంలో బ్యాటరీ ధరను వేరు చేయడం వల్ల వినియోగదారులు తక్కువ మొత్తం చెల్లించి వాహనాన్ని కొనుగోలు చేయవచ్చు. తర్వాత బ్యాటరీ వినియోగానికి నెలవారీ చందా విధానాన్ని ఎంచుకోవచ్చు. ఈ చందా సుమారు నెలకు రూ.862 నుంచి ప్రారంభమవుతుందని కంపెనీ తెలిపింది. ఐదు సంవత్సరాలు లేదా డెబ్బై వేల కిలోమీటర్ల వరకు పొడిగించిన వారంటీ కూడా అందుబాటులో ఉంటుందని సంస్థ వెల్లడించింది. దీంతో ఎలక్ట్రిక్ స్కూటర్లను మరింత మంది వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని కంపెనీ పేర్కొంది.

# కుప్పకూలిన గుడ్డు ధరలు



న్యూఢిల్లీ, మార్చి 13,మనగళం: ఇరాన్ మరియు ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం భారతదేశ పౌల్ట్రీ రంగంపై పడింది. ఈ పరిస్థితుల కారణంగా గల్ఫ్ దేశాలకు ఎగుమతి కావాల్సిన కోడిగుడ్లు పోర్టుల వద్దే నిలిచిపోవడంతో మార్కెట్లో నిల్వలు భారీగా పెరిగాయి. ఫలితంగా గుడ్డు ధరలు గణనీయంగా పడిపోవడంతో పౌల్ట్రీ రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రవాణా వ్యవస్థపై యుద్ధ ప్రభావం పడటంతో ఎగుమతులు స్తంభించిపోయాయి. దీంతో దేశీయ మార్కెట్లో గుడ్ల సరఫరా అధికమై ధరలు ఒక్కసారిగా క్షీణించాయి. గతంలో ఒక్క గుడ్డు ధర ఏడు రూపాయల వరకు ఉండగా ప్రస్తుతం అది మూడున్నర నుంచి నాలుగు రూపాయల మధ్యకు పడిపోయినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ధరలు భారీగా పడిపోవడంతో పౌల్ట్రీ రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఎగుమతులు తిరిగి ప్రారంభమై అంతర్జాతీయ పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకుంటేనే గుడ్డు ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పరిస్థితి కొనసాగితే పౌల్ట్రీ పరిశ్రమకు మరింత నష్టం కలగవచ్చని వారు హెచ్చరిస్తున్నారు.

# ఎల్‌పీజీ సిలిండర్ లేదా ఇండక్షన్.. ఏది చౌక?



న్యూఢిల్లీ, మార్చి 13 ,మనగళం: మధ్యప్రాచ్య ప్రాంతంలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం ఇప్పుడు సామాన్య ప్రజల వంటగదిపై కూడా కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు మరియు సహజ వాయువు సరఫరా వ్యవస్థపై ప్రభావం పడడంతో దేశంలో ఎల్‌పీజీ సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే దేశంలో గ్యాస్ ఉత్పత్తి తగినంతగా ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సరఫరా సజావుగా కొనసాగేందుకు నిత్యావసర వస్తువుల నియంత్రణ చట్టాన్ని కూడా అమలు చేసింది. అయినప్పటికీ గ్యాస్ బుకింగ్‌లలో ఆలస్యం, ధరలు పెరుగుతున్నాయనే వార్తలతో వినియోగదారులు ప్రత్యామ్నాయ వంట విధానాల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలక్ట్రిక్ ఇండక్షన్ వంట పరికరాల అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా వంటి ప్రధాన మహానగరాల్లో ఇండక్షన్ పరికరాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. అనేక ప్రాంతాల్లో ఇవి దొరకని పరిస్థితి నెలకొంది. పెద్ద షోరూమ్‌ల నుంచి చిన్న దుకాణాల వరకు చాలా చోట్ల నిల్వలు ఖాళీ కావడం గమనార్హం. దీంతో చాలా మంది వినియోగదారులు గ్యాస్ స్టవ్ నుంచి ఇండక్షన్ పరికరాలకు మారడం ఆర్థికంగా లాభదాయకమా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ స్టవ్‌పై వంట చేసేటప్పుడు ఉత్పత్తి అయ్యే వేడి మొత్తం పాత్రకు చేరదు. సుమారు అరవై శాతం వరకు వేడి గాలిలోకి లేదా పాత్ర వైపులా వృథా అవుతుంది. అంటే వినియోగించే గ్యాస్‌లో కేవలం నలభై శాతం మాత్రమే వంటకు ఉపయోగపడుతుంది. దీనివల్ల ఇంధన వినియోగం ఎక్కువ అవుతుంది. ఇదే సమయంలో ఇండక్షన్ వంట పరికరాలు ఆధునిక సాంకేతికతపై పనిచేస్తాయి. గాజు ఉపరితలం కింద ఉన్న అయస్కాంత కాయిల్స్ ద్వారా పాత్రలోని లోహంలోనే నేరుగా వేడి ఉత్పత్తి అవుతుంది. ఈ విధానం వల్ల శక్తి నష్టం చాలా తక్కువగా ఉంటుంది. దాదాపు తొంభై శాతం వరకు శక్తి నేరుగా వంటకు ఉపయోగపడుతుంది. అందువల్ల విద్యుత్ ఖర్చు ఉన్నప్పటికీ చాలా సందర్భాల్లో ఇండక్షన్ వంట పద్ధతి గ్యాస్‌తో పోలిస్తే మరింత సమర్థవంతంగా ఉండొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అయితే వంట పద్ధతి ఎంపిక పూర్తిగా కుటుంబ అవసరాలు, విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. తరచుగా ఎక్కువ వంట చేసే కుటుంబాలు గ్యాస్‌ను ఉపయోగిస్తే, చిన్న వంటలు లేదా తక్కువ వినియోగం ఉన్న కుటుంబాలకు ఇండక్షన్ పరికరాలు మంచి ప్రత్యామ్నాయంగా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# మెర్సిడెస్ బెంజ్ కార్ల ధరలు పెంపు




న్యూఢిల్లీ, మార్చి 13,మనగళం: ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ ఇండియా తమ కార్ల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ ఒకటి నుంచి కంపెనీ విక్రయిస్తున్న అన్ని మోడళ్లపై సుమారు రెండు శాతం వరకు ధరలు పెరగనున్నాయని సంస్థ వెల్లడించింది. పెరుగుతున్న ముడిసరుకుల ధరలు మరియు విదేశీ మారకద్రవ్యంలో అస్థిరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది.

ఈ విషయంపై సంస్థ సేల్స్ మరియు మార్కెటింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ బ్రెండన్ సిసింగ్ మాట్లాడుతూ, ముఖ్యంగా యూరోతో పోలిస్తే భారత రూపాయి విలువ తగ్గడం వల్ల నిర్వహణ ఖర్చులు పెరిగాయని అన్నారు. వ్యాపార సుస్థిరతను కొనసాగించేందుకు ధరల సవరణ తప్పనిసరి అయిందని తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి సంస్థ పోర్ట్‌ఫోలియోలోని అన్ని కార్లపై సుమారు రెండు శాతం ధరల పెంపును అమలు చేస్తున్నామని చెప్పారు. అయితే ఈ పెంపు ప్రభావం వినియోగదారులపై తక్కువగా ఉండేలా చర్యలు తీసుకుంటామని, అత్యుత్తమ ఉత్పత్తులు మరియు సేవలు అందించడంపై తమ దృష్టి కొనసాగుతుందని ఆయన వివరించారు.

ఇదిలా ఉండగా మరో జర్మన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి ఇండియా కూడా ఇప్పటికే ధరల పెంపు నిర్ణయం ప్రకటించింది. తమ కార్ల ధరలను కూడా ఏప్రిల్ ఒకటి నుంచి రెండు శాతం వరకు పెంచుతున్నట్లు వెల్లడించింది. ముడిసరుకుల ధరలు పెరగడం మరియు కరెన్సీ మార్పిడి రేట్లలో వచ్చిన మార్పులే ఇందుకు కారణమని సంస్థ పేర్కొంది. దీంతో ఏప్రిల్ నెల నుంచి రెండు ప్రధాన జర్మన్ లగ్జరీ కార్ల బ్రాండ్ల కార్ల ధరలు పెరగనున్నాయి

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## అవగాహన పెంచితేనే ప్రమాదాల నివారణ

దేశవ్యాప్తంగా రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, రవాణా నియమాలను పట్టించుకోకపోవడం, అతివేగంగా ప్రయాణించడం వంటి కారణాల వల్ల ప్రతి సంవత్సరం వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అనేక కుటుంబాలు తమ కుటుంబ సభ్యులను కోల్పోయి తీవ్ర విషాదంలో మునిగిపోతున్నాయి. రోడ్డు ప్రమాదాలు కేవలం వ్యక్తిగత నష్టమే కాకుండా సమాజానికి కూడా పెద్ద నష్టాన్ని కలిగిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో అతివేగం ఒకటి. సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో చాలా మంది వేగంగా వాహనాలు నడిపేందుకు ప్రయత్నిస్తారు. అయితే వేగం పెరిగిన కొద్దీ ప్రమాదం సంభవించే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి. వాహనాన్ని నియంత్రించడం కష్టమవడం, అప్రత్యక్షంగా ఎదురయ్యే పరిస్థితులకు స్పందించలేకపోవడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. అందువల్ల వేగ నియంత్రణ ఎంతో అవసరం. మద్యం సేవించి వాహనం నడపడం కూడా రోడ్డు ప్రమాదాలకు మరో ప్రధాన కారణంగా నిలుస్తోంది. మద్యం ప్రభావంలో డ్రైవింగ్ చేయడం వల్ల మనిషి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం తగ్గిపోతుంది. దాంతో వాహనాన్ని సరిగా నియంత్రించలేక ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు పెరుగుతాయి. ఈ కారణంగా మద్యం సేవించి వాహనం నడపకుండా ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలి.

మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం కూడా ప్రమాదాలకు దారితీస్తోంది. డ్రైవింగ్ సమయంలో ఫోన్ మాట్లాడడం లేదా సందేశాలు చూడడం వల్ల డ్రైవర్ దృష్టి రోడ్డుపై ఉండదు. కొన్ని క్షణాల నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదానికి కారణమవుతుంది. అందువల్ల వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ వినియోగాన్ని పూర్తిగా నివారించడం అవసరం. వాహనదారులు హెల్మెట్, సీటుబెల్ట్ వంటి భద్రతా పరికరాలను తప్పనిసరిగా ఉపయోగించాలి. రెండు చక్రాల వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా తలకు గాయాలు తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. అలాగే నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదం జరిగినప్పుడు గాయాల తీవ్రతను తగ్గించుకోవచ్చు. ఈ భద్రతా చర్యలు ప్రాణాలను కాపాడటంలో కీలకంగా పనిచేస్తాయి. ప్రభుత్వం కూడా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రోడ్లను సక్రమంగా నిర్మించడం, గుంతలు లేకుండా నిర్వహించడం, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. అలాగే రాత్రి సమయంలో సరైన లైటింగ్ ఉండేలా చూడడం కూడా ప్రమాదాలను తగ్గించడంలో సహాయపడుతుంది. రవాణా నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం కూడా అవసరం. ట్రాఫిక్ పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి నియమాలను పాటించని వారిపై జరిమానాలు విధించాలి. కఠిన చర్యలు తీసుకుంటేనే ప్రజలు నియమాలను పాటించేలా అవగాహన ఏర్పడుతుంది. రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు కూడా తరచుగా నిర్వహించాలి. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా వాటిని గణనీయంగా తగ్గించడం మాత్రం సాధ్యమే. ప్రజలు బాధ్యతగా వాహనాలు నడపడం, రవాణా నియమాలను గౌరవించడం, ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరిస్తే అనేక ప్రాణాలను కాపాడగలమని నిపుణులు సూచిస్తున్నారు. వాహనదారులు రవాణా నియమాలను కచ్చితంగా పాటించడం అత్యంత ముఖ్యమైన అంశం. అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తాయి. హెల్మెట్, సీటుబెల్ట్ వంటి భద్రతా పరికరాలను తప్పనిసరిగా ఉపయోగించాలి. ఇవి ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రభుత్వం కూడా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. రోడ్లను సరిగా నిర్మించడం, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ నియమాల అమలును కఠినంగా చేపట్టడం వంటి చర్యలు తీసుకోవాలి. రోడ్లపై సరైన లైటింగ్, స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చు. ప్రమాదాలను నివారించడంలో ప్రజల బాధ్యత కూడా ఎంతో ముఖ్యమైనది. ట్రాఫిక్ నియమాలను గౌరవించడం, ఇతర వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడపడం అవసరం. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి కారణమవుతుందని గుర్తుంచుకోవాలి. ప్రజలు మరియు ప్రభుత్వం కలిసి పనిచేస్తేనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని నిపుణులు సూచిస్తున్నారు.




# పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం.. పెరిగిన వంట నూనె ధరలు

న్యూఢిల్లీ, మార్చి 13,మన గళం, పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల ప్రభావం భారతదేశంలోని వంటింటిపై పడుతోంది. సరఫరా వ్యవస్థపై ప్రభావం పడటంతో దేశంలో వంట గ్యాస్‌తో పాటు వంట నూనెల ధరలు కూడా పెరుగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఏర్పడిన అనిశ్చితి కారణంగా నూనెల ధరలు ఇటీవల రోజులుగా క్రమంగా పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

గత వారంతో పోలిస్తే ప్రస్తుతం మార్కెట్‌లో అన్ని రకాల వంట నూనెల ధరలు పెరిగాయి. ముఖ్యంగా సన్‌ఫ్లవర్ నూనె లీటరుకు సుమారు నాలుగు రూపాయల వరకు పెరిగింది. అలాగే పామాయిల్, వేరుశనగ నూనెల ధరలు కూడా లీటరుకు ఒక రూపాయి నుంచి రెండు రూపాయల యాభై పైసల వరకు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు.

భారతదేశం తన వంట నూనెల అవసరాల్లో దాదాపు తొంభై శాతం వరకు విదేశీ దిగుమతులపై ఆధారపడుతోంది. పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ ఉద్రిక్తతలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం, రవాణా వ్యయాలు అధికమవడం వంటి కారణాలు ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. పరిస్థితులు



ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో వంట నూనెల ధరలు మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు.. వెండి కూడా ఒత్తిడిలోనే

హైదరాబాద్ మార్చి 13,మన గళం : దేశీయ మార్కెట్లో బంగారం ధరలు శుక్రవారం స్వల్పంగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో పాటు పెట్టుబడిదారుల జాగ్రత్త ధోరణి కారణంగా ధరల్లో తగ్గుదల కనిపించింది. 10 గ్రాముల బంగారం ధర సగటున రూ.992 తగ్గి ప్రస్తుతం సుమారు రూ.1.59 లక్షల వద్ద ట్రేడవుతోంది. అయితే నగరాలవారీగా ధరల్లో స్వల్ప తేడాలు కనిపిస్తున్నాయి. వెండి ధరలు కూడా స్వల్ప ఒత్తిడిలో కొనసాగుతున్నాయి. ఢిల్లీలో ఒక గ్రాము వెండి ధర రూ.280గా ఉండగా, కిలో ధర రూ.2,80,000గా ఉంది. చెన్నైలో ఒక గ్రాము వెండి రూ.290గా ఉండగా కిలో ధర రూ.2,90,000గా ఉంది. బెంగళూరు, ముంబై, పూణే మరియు కోల్‌కతా నగరాల్లో ఒక గ్రాము వెండి ధర రూ.280గా, కిలో ధర రూ.2,80,000గా నమోదైంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఇలా ఉన్నాయి. ఢిల్లీలో 18 క్యారెట్ బంగారం గ్రాముకు రూ.12,607, 22 క్యారెట్ రూ.14,745, 24 క్యారెట్ రూ.16,084గా నమోదైంది. చెన్నైలో 18 క్యారెట్ బంగారం ధర గ్రాముకు రూ.12,550, 22 క్యారెట్ రూ.14,900, 24 క్యారెట్ రూ.16,256గా ఉంది. బెంగళూరు నగరంలో 18 క్యారెట్ బంగారం ధర గ్రాముకు రూ.12,052, 22 క్యారెట్ రూ.14,730, 24 క్యారెట్ రూ.16,069గా నమోదైంది. ముంబై మరియు పూణే నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మార్పులు, డాలర్ మారకం విలువలో హెచ్చుతగ్గులు మరియు పెట్టుబడిదారుల కొనుగోలు ధోరణి ఆధారంగా బంగారం, వెండి ధరల్లో రోజువారీగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ధరలు కొద్దిగా తగ్గినా, దీర్ఘకాలంలో బంగారం పెట్టుబడిగా స్థిరమైనదేనని వారు అభిప్రాయపడుతున్నారు

# గణిత శాస్త్ర ప్రాముఖ్యతను గుర్తుచేసే రోజు

**– విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంపే లక్ష్యం – పాఠశాలలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు**



డెస్క్, మార్చి 13,మన గళం : ప్రతి సంవత్సరం మార్చి 14ను అంతర్జాతీయ గణిత దినోత్సవంగా ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. గణిత శాస్త్రం మన జీవితంలో ఎంత ముఖ్యమో తెలియజేయడం, విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంపొందించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధికి గణితం పునాది కావడంతో దీనికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. మన రోజువారీ జీవితంలో గణితానికి ఎంతో కీలక స్థానం ఉంది. చిన్న లెక్కల నుంచి పెద్ద శాస్త్రీయ ఆవిష్కరణల వరకు ప్రతి రంగంలో గణిత శాస్త్రం అవసరం. సమయం లెక్కించడం, డబ్బు లావాదేవీలు నిర్వహించడం, నిర్మాణాలు చేయడం వంటి అనేక కార్యకలాపాలు గణితంపై ఆధారపడి ఉంటాయి. విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక రంగం, వైద్య రంగం, ఆర్థిక వ్యవస్థ వంటి అనేక రంగాల్లో గణితం కీలక పాత్ర పోషిస్తోంది. శాస్త్రవేత్తలు చేసే పరిశోధనల్లో గణిత సూత్రాలు ముఖ్యమైన భాగంగా ఉంటాయి. అంతరిక్ష పరిశోధనల నుంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు గణితం ఒక ముఖ్యమైన ఆధారంగా నిలుస్తోంది. అంతర్జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గణిత పోటీలు, ప్రదర్శనలు, సదస్సులు నిర్వహిస్తూ విద్యార్థుల్లో గణితంపై అవగాహన పెంచే ప్రయత్నం చేస్తారు. ఈ కార్యక్రమాలు విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తిని పెంచడంలో సహాయపడతాయి.

ముఖ్యంగా చిన్న వయసు నుంచే గణితంపై ఆసక్తి పెంపొందించడం అవసరమని విద్యావేత్తలు సూచిస్తున్నారు. సరైన బోధన పద్ధతులు, సులభమైన ఉదాహరణల ద్వారా గణితాన్ని నేర్పితే విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటారని వారు చెబుతున్నారు. గణితాన్ని భయపడకుండా ఆసక్తిగా నేర్చుకోవాలని సూచిస్తున్నారు. ఈ దినాన్ని గణితంలో ప్రముఖ కృషి చేసిన శాస్త్రవేత్తలను స్మరించుకునే సందర్భంగా కూడా నిర్వహిస్తారు. గణిత శాస్త్ర అభివృద్ధికి వారు చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ విద్యార్థులకు ప్రేరణ కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. గణిత శాస్త్రం ద్వారా ప్రపంచంలో అనేక మార్పులు వచ్చాయని నిపుణులు చెబుతున్నారు.

మార్చి 14 తేదీ గణిత శాస్త్రంలో ప్రసిద్ధి చెందిన పాయి సంఖ్యతో కూడా సంబంధం కలిగి ఉంది. పాయి విలువ సుమారు 3.14గా ఉండటంతో ఈ తేదీని గణితానికి ప్రతీకగా భావిస్తారు. అందుకే ఈ రోజున గణిత దినోత్సవాన్ని నిర్వహించడం ప్రత్యేకతను కలిగిస్తోంది. అంతర్జాతీయ గణిత దినోత్సవం ద్వారా గణిత శాస్త్ర ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేయడమే కాకుండా విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు, పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించడం లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గణితంపై అవగాహన పెరిగితే శాస్త్ర సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మన రోజువారీ జీవితంలో గణితానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. చిన్న చిన్న లెక్కల నుంచి పెద్ద పెద్ద శాస్త్రీయ పరిశోధనల వరకు గణితం కీలక పాత్ర పోషిస్తుంది. విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక రంగం, ఆర్థిక వ్యవస్థ, నిర్మాణ రంగం వంటి అనేక రంగాల్లో గణిత శాస్త్రం ఆధారంగా అనేక ఆవిష్కరణలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గణిత పోటీలు, ప్రదర్శనలు, సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంచే ప్రయత్నం చేస్తారు. విద్యార్థులు గణితాన్ని భయపడకుండా ఆసక్తిగా నేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సరైన బోధన, ప్రోత్సాహం ఉంటే గణితం చాలా సులభంగా అర్థమవుతుందని చెబుతున్నారు. ఈ దినోత్సవం ద్వారా గణిత శాస్త్రం ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేయడంతో పాటు విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు, పరిశోధనలకు ప్రేరణ కలిగించడం లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# పిల్లలు ఎక్కువ భాషలు నేర్చుకుంటే లాభాలు

**– మల్టీటాస్కింగ్ నైపుణ్యం పెరుగుతుంది – జ్ఞాపకశక్తి మెరుగవుతుంది – మెదడు చురుగ్గా పనిచేస్తుంది**



డెస్క్, 13 మార్చి, మన గళం, ఆరోగ్యం : చిన్నారులు మొదటగా ఇంట్లోనే మాటలు నేర్చుకోవడం ప్రారంభిస్తారు. కుటుంబ సభ్యులు ఏ భాష మాట్లాడితే అదే భాషను వారు అనుకరిస్తూ మాట్లాడటం ప్రారంభిస్తారు. తరువాత స్కూల్‌కు వెళ్లడం మొదలైన తర్వాత హిందీ, ఇంగ్లీషు వంటి ఇతర భాషలను కూడా చదువులో భాగంగా నేర్చుకుంటారు. ఈ క్రమంలో కొందరు పిల్లలు ఆ భాషలను కేవలం చదవడం, రాయడం వరకు మాత్రమే పరిమితం అవుతారు. కానీ మరికొందరు ఆ భాషల్లో మాట్లాడే నైపుణ్యాన్ని కూడా అభివృద్ధి చేసుకుంటారు. ఒకటి కంటే ఎక్కువ భాషలు మాట్లాడగలిగే చిన్నారుల్లో మెదడు చురుగ్గా పనిచేయడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ తరం చిన్నారులు చిన్న వయసులోనే అనేక విషయాలను వేగంగా నేర్చుకుంటున్నారు. చదువుతో పాటు తమకు ఇష్టమైన ఇతర కార్యకలాపాల్లో కూడా పాల్గొంటున్నారు. అయితే సాధారణ పిల్లలతో పోలిస్తే ఎక్కువ భాషలు నేర్చుకున్న పిల్లలు మరింత చురుగ్గా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. ఒకే సమయంలో వేర్వేరు భాషల్లో ప్రశ్నలు అడిగినా, అదే భాషలో సమాధానం ఇవ్వగల సామర్థ్యం వారికి ఉంటుంది. పరిస్థితికి అనుగుణంగా భాషను మార్చి మాట్లాడగల సామర్థ్యం కూడా పెరుగుతుందని వారు పేర్కొంటున్నారు.

ఒకటి కంటే ఎక్కువ భాషలు నేర్చుకున్న పిల్లల్లో మల్టీటాస్కింగ్ నైపుణ్యం కూడా ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఒకేసారి రెండు లేదా అంతకంటే ఎక్కువ పనులను చేయడంలో వారు చురుకుగా ఉంటారు. ఒక పని చేస్తూనే మరో పనిపై కూడా దృష్టి పెట్టగల సామర్థ్యం పెరుగుతుంది. ఈ లక్షణం భవిష్యత్తులో చదువు, ఉద్యోగం వంటి రంగాల్లో వారికి ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు వివరిస్తున్నారు. భాషలు నేర్చుకోవడం మెదడు పనితీరుపై కూడా మంచి ప్రభావం చూపుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఒకటి కంటే ఎక్కువ భాషలు నేర్చుకున్నప్పుడు వాటికి సంబంధించిన పదజాలం మెదడులో నిల్వ అవుతుంది. దీంతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అవసరమైన సమయంలో సరైన పదాన్ని గుర్తించి ఉపయోగించడానికి మెదడు వేగంగా స్పందిస్తుంది. దీని వల్ల ఆలోచనా శక్తి కూడా మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. పలు అధ్యయనాల ప్రకారం ఒకే భాష మాత్రమే మాట్లాడగలిగే వ్యక్తులతో పోలిస్తే రెండు లేదా అంతకంటే ఎక్కువ భాషలు మాట్లాడగలిగే వారు వివిధ కార్యకలాపాల్లో మరింత చురుగ్గా ఉంటారని వెల్లడైంది. అందువల్ల చిన్న వయసులోనే పిల్లలకు కొత్త భాషలు నేర్పించడం ద్వారా వారి మేధస్సు అభివృద్ధి చెందుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

---


# పండ్లు ఎప్పుడు తింటే ఆరోగ్యానికి మేలు?



డెస్క్, 13 మార్చి ,మన గళం, ఆరోగ్యం : పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అందరికీ తెలిసిందే. రోజువారీ ఆహారంలో పండ్లను చేర్చుకోవడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, పీచు పదార్థం, యాంటీఆక్సిడెంట్లు లభిస్తాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పండ్లు తీసుకోవడం వల్ల అనేక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే పండ్లను ఎప్పుడు తింటాం అన్నది కూడా చాలా ముఖ్యమైన విషయం అని నిపుణులు సూచిస్తున్నారు. చాలా మంది చేసే సాధారణ తప్పు ఏమిటంటే కడుపు నిండా భోజనం చేసిన తర్వాత పండ్లు తినడం. కానీ ఇలా చేయడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పండ్లు తినే సమయం సరైనది కాకపోతే వాటి వల్ల కలిగే ప్రయోజనాలు తగ్గిపోవచ్చు. పండ్లలో సహజ చక్కెరతో పాటు పీచు పదార్థం అధికంగా ఉంటుంది. మనం తినే ఆహారంలో ప్రోటీన్, కొవ్వు వంటి పదార్థాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే జీర్ణక్రియ ప్రక్రియలో అంతరాయం కలగవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉంటుంది.

అందువల్ల ఆరోగ్యంగా ఉండాలంటే భోజనం చేసిన వెంటనే పండ్లు తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం అల్పాహారంగా లేదా మధ్యాహ్నం తర్వాత ఆకలిగా అనిపించినప్పుడు పండ్లు తినడం మంచిదని వారు చెబుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో పండ్ల ముక్కలు తినడం శరీరానికి శక్తిని అందించడంలో సహాయపడుతుంది. రోజువారీ ఆహారంలో సరైన సమయంలో పండ్లను చేర్చుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. దీనివల్ల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు అనేక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఎండాకాలంలో చర్మ సంరక్షణ ఇలా



డెస్క్, 13 మార్చిద, మన గళం, ఆరోగ్యం : ఎండాకాలంలో చర్మ సంరక్షణ కొంచెం కష్టమైన పనిగా మారుతుంది. ఉక్కపోత, అధిక ఉష్ణోగ్రతలు, చెమటల కారణంగా చర్మం త్వరగా అలసిపోయినట్లు కనిపిస్తుంది. చాలా మందికి చిరాకు, చర్మం మసకబారడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అయితే ఈ కాలంలో చర్మ సంరక్షణ విషయంలో అశ్రద్ధ చేయకూడదని సౌందర్య నిపుణులు సూచిస్తున్నారు. కేవలం సూర్యరశ్మి నుంచి రక్షణ కోసం లోషన్ వాడటం మాత్రమే కాకుండా మరికొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని వారు చెబుతున్నారు

వేసవిలో చర్మానికి తగినంత తేమ అందించడం చాలా అవసరం. ఈ సమయంలో వాటర్ ఆధారిత సీరమ్‌లను ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇవి చర్మపు లోపలి పొరల్లోకి చేరి తేమను అందించడంలో సహాయపడతాయి. అలాగే చర్మం తాజాగా కనిపించేందుకు తోడ్పడతాయి. ముడతలు, సన్నని గీతలు తగ్గించి చర్మాన్ని మృదువుగా ఉంచడంలో కూడా ఇవి ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు.

వేసవిలో చెమటలు ఎక్కువగా పడటం వల్ల చర్మంపై దుమ్ము, మలినాలు సులభంగా పేరుకుపోతాయి. చాలామంది చెమట తుడుచుకుంటే చర్మం శుభ్రపడుతుందని భావిస్తారు. కానీ అది పూర్తిగా నిజం కాదని నిపుణులు చెబుతున్నారు. చర్మంపై ఉన్న మృతకణాలు తొలగించడానికి ఎప్పటికప్పుడు స్క్రబ్ చేయడం అవసరమని వారు సూచిస్తున్నారు. అయితే ఇందుకు ఉపయోగించే పదార్థాలు సహజమైనవి కావాలని, చర్మానికి హాని కలిగించని ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎండాకాలంలో మేకప్ విషయంలో కూడా జాగ్రత్త అవసరమని నిపుణులు చెబుతున్నారు. వీలైనంత వరకు తక్కువ మేకప్ వాడటం మంచిదని వారు సూచిస్తున్నారు. ముఖ్యంగా నూనె ఆధారిత ఉత్పత్తులను తగ్గించడం మంచిదని చెబుతున్నారు. అవసరమైతే తేలికపాటి మేకప్ మాత్రమే వాడాలని, పెదవుల సంరక్షణ కోసం లిప్ బామ్ ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

బయటకు వెళ్లే ముందు సూర్యరశ్మి నుంచి చర్మాన్ని రక్షించేందుకు సన్‌స్క్రీన్ తప్పనిసరిగా ఉపయోగించాలని నిపుణులు చెబుతున్నారు. చర్మ తత్వానికి అనుగుణంగా సరైన రక్షణ గల లోషన్‌ను ఎంచుకోవాలని వారు సూచిస్తున్నారు. ఎక్కువసేపు ఎండలో ఉండాల్సి వస్తే ప్రతి రెండు గంటలకు ఒకసారి సన్‌స్క్రీన్ మళ్లీ రాసుకోవడం అవసరమని వారు చెబుతున్నారు. వేసవిలో ముఖం, పాదాల సంరక్షణ విషయంలో కూడా నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు. నిర్దిష్ట వ్యవధిలో ఫేషియల్, పాదాల సంరక్షణ వంటి చికిత్సలు చేయించుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. పార్లర్‌కు వెళ్లే అవకాశం లేకపోతే ఇంట్లోనే సహజ పదార్థాలతో చర్మ సంరక్షణ చేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. సరైన సంరక్షణతో వేసవిలో కూడా చర్మాన్ని ఆరోగ్యంగా, తాజాగా ఉంచుకోవచ్చని వారు చెబుతున్నారు.


# బీరకాయ తింటే ఆరోగ్యానికి ఎన్నో లాభాలు



డెస్క్, 13 మార్చి ,మన గళం, ఆరోగ్యం : మన వంటింట్లో సులభంగా దొరికే కూరగాయల్లో బీరకాయ ఒకటి. తక్కువ ధరలో అందుబాటులో ఉండే ఈ కూరగాయ ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. ఇందులో ఉండే పలు పోషకాలు శరీరానికి అవసరమైన శక్తిని అందించడమే కాకుండా అనేక వ్యాధులను దూరం చేయడంలో కూడా సహాయపడతాయి. ముఖ్యంగా మధుమేహం, జీర్ణక్రియ సమస్యలు, బరువు నియంత్రణ వంటి అంశాల్లో బీరకాయ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బీరకాయలో ఉండే కొన్ని ప్రత్యేక పోషకాలు రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా నేతి బీరకాయ మధుమేహంతో బాధపడుతున్న వారికి ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుందని భావిస్తున్నారు. అందువల్ల మధుమేహ రోగులు తమ ఆహారంలో బీరకాయను చేర్చుకోవడం వల్ల ప్రయోజనం పొందవచ్చు.

ఇందులో నీటి శాతం, పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. దీర్ఘకాలిక మలబద్ధకం సమస్యతో బాధపడేవారికి ఇది మంచి సహజ పరిష్కారంగా ఉపయోగపడుతుంది. బీరకాయ తినడం వల్ల పొట్టలో ఉన్న మలినాలు బయటకు వెళ్లి గ్యాస్ సమస్యలు కూడా తగ్గుతాయని నిపుణులు సూచిస్తున్నారు. బీరకాయలో క్యాలరీలు చాలా తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఎంతో ఉపయోగకరం. ఇది తిన్న తర్వాత కడుపు నిండిన భావన కలిగిస్తుంది. దీంతో అతిగా తినడం తగ్గి బరువు నియంత్రణలో ఉంటుంది. పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును తగ్గించుకోవాలనుకునే వారికి కూడా బీరకాయ మంచి ఆహారంగా భావిస్తున్నారు. ఇందులో ఉండే బీటా కెరోటిన్ వంటి పోషకాలు కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడతాయి. అలాగే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో కూడా ఇది సహాయపడుతుంది. రక్తపోటు నియంత్రణలో కూడా బీరకాయ పాత్ర ఉందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా రక్తశుద్ధి చేయడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. దీనివల్ల మొటిమలు, మచ్చలు తగ్గి చర్మం కాంతివంతంగా మారుతుంది. అందువల్ల బీరకాయను వారంలో కనీసం రెండు సార్లు ఆహారంలో భాగంగా చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# జుట్టు రాలకుండా తలస్నానం ఎన్ని రోజులు?



డెస్క్, 13 మార్చి,మన గళం, ఆరోగ్యం : మనిషి అందంగా కనిపించడంలో ముఖం, దుస్తులు మాత్రమే కాదు జుట్టు కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే చాలా మంది జుట్టు సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతుంటారు. అయితే ఈ మధ్యకాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి కారణాలతో జుట్టు రాలే సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. నిపుణుల ప్రకారం జుట్టు రాలడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ మనం ప్రతిరోజూ చేసే తలస్నానం కూడా ఒక ముఖ్యమైన కారణంగా మారవచ్చని చెబుతున్నారు. వైద్య నిపుణుల ప్రకారం కొందరు ప్రతిరోజూ తలస్నానం చేస్తారు. మరికొందరు చాలా రోజుల పాటు తలస్నానం చేయకుండా ఉంటారు. ఈ రెండు అలవాట్లు కూడా జుట్టు రాలడానికి కారణమయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. తలస్నానం ఎంత తరచుగా చేయాలి అన్నది వ్యక్తి జుట్టు రకం, తల చర్మం పరిస్థితిని బట్టి మారుతుందని వారు సూచిస్తున్నారు. కాబట్టి జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే తమ జుట్టు రకానికి అనుగుణంగా తలస్నానం చేయడం అవసరం.

జిడ్డుగా ఉండే జుట్టు ఉన్నవారిలో తల చర్మం ఎక్కువగా నూనె ఉత్పత్తి చేస్తుంది. దీని వల్ల ధూళి, మురికి త్వరగా చేరి జుట్టు కుదుళ్లను బలహీనపరచే ప్రమాదం ఉంటుంది. అందువల్ల జిడ్డు జుట్టు ఉన్నవారు వారంలో మూడు నుంచి నాలుగు సార్లు తలస్నానం చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. సరైన రీతిలో తలస్నానం చేయడం వల్ల తల చర్మం శుభ్రంగా ఉండి జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. ఇక జుట్టు పొడిగా ఉండే వ్యక్తులు ప్రతిరోజూ తలస్నానం చేయడం వల్ల జుట్టులో ఉన్న సహజ తైలాలు తొలగిపోతాయి. దీని వల్ల జుట్టు మరింత పొడిగా మారి సులభంగా విరిగిపోవచ్చు. అందువల్ల పొడి జుట్టు ఉన్నవారు వారానికి రెండు సార్లు మాత్రమే తలస్నానం చేయడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా తలస్నానం మధ్యలో తగినంత విరామం ఇవ్వడం వల్ల జుట్టులో సహజ తేమ నిలిచి ఉండి జుట్టు రాలే సమస్య తగ్గే అవకాశం ఉంటుంది. జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే సరైన తలస్నానం మాత్రమే కాదు, పోషకాహారం, ఒత్తిడి తగ్గించడం, తల చర్మాన్ని పరిశుభ్రంగా ఉంచడం కూడా చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. సరైన అలవాట్లు పాటిస్తే జుట్టు రాలే సమస్యను చాలా వరకు నియంత్రించవచ్చని వారు సూచిస్తున్నారు.

## తర్వాత హన్సిక తొలి పోస్ట్.. కష్టాల్లోనూ పాజిటివ్‌గా ఉండాలని సందేశం



ముంబై మార్చి 13 ,మన గళం : టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులను తన అందం, నటనతో ఆకట్టుకున్న ప్రముఖ నటి హన్సిక మోత్వాని వ్యక్తిగత జీవితం ఇటీవల సోషల్ మీడియాలో పెద్ద చర్చగా మారింది. వ్యాపారవేత్త సోహైల్ కతూరియాను ప్రేమించి వివాహం చేసుకున్న హన్సిక అతనికి విడాకులు ఇచ్చిందనే వార్తలు కొంతకాలంగా నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో హన్సిక చేసిన తాజా సోషల్ మీడియా పోస్ట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. హన్సిక తన సోషల్ మీడియా ఖాతాలో "చర్ది కాలా ఆల్వేస్" అనే పంజాబీ కోటేషన్‌ను షేర్ చేసింది. ఈ పదానికి అర్థం ఎలాంటి కష్టాలు ఎదురైనా మనసులో ధైర్యం, పాజిటివ్ భావనను కొనసాగించాలి అన్నది. ఈ పోస్ట్ ద్వారా తన జీవితంలో ఎదురైన పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటున్నానని హన్సిక సూచించినట్లు నెటిజన్లు భావిస్తున్నారు. కొంతకాలంగా హన్సిక, సోహైల్ కతూరియా మధ్య విభేదాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఇటీవల ముంబైలోని బాంద్రా కోర్టు వీరి విడాకులను ఖరారు చేసిందని కొన్ని మీడియా కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు హన్సిక లేదా ఆమె కుటుంబ సభ్యులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. హన్సిక మోత్వాని, సోహైల్ కతూరియా వివాహం 2022 డిసెంబర్ 4న రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఘనంగా జరిగింది. ఆ పెళ్లి వేడుక అట్టహాసంగా జరిగి అప్పట్లో సోషల్ మీడియాలో కూడా విస్తృతంగా చర్చకు దారితీసింది. పెళ్లి తర్వాత కొంతకాలం వరకు ఈ జంట సంతోషంగా జీవిస్తున్నట్లు కనిపించింది. అయితే కొన్ని నెలల తర్వాత వీరిద్దరి మధ్య విభేదాలు ప్రారంభమైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరిగింది. గత కొంతకాలంగా హన్సిక తన భర్తకు దూరంగా ఉంటూ తల్లితో కలిసి నివసిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అదే సమయంలో హన్సిక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి భర్తతో కలిసి ఉన్న కొన్ని ఫోటోలను తొలగించడం కూడా ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చింది. హన్సిక వివాహం సమయంలో కూడా కొన్ని వివాదాలు చర్చనీయాంశమయ్యాయి. సోహైల్ కతూరియాకు ఇది రెండో వివాహం కాగా, అతని మొదటి భార్య హన్సికకు సన్నిహిత స్నేహితురాలు అన్న వార్తలు అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ట్రోల్స్‌పై హన్సిక స్పందిస్తూ సోహైల్ గతం తనకు ముందే తెలుసని, వారి విడాకులకు తాను కారణం కాదని స్పష్టం చేసింది. ఇప్పటివరకు హన్సిక, సోహైల్ విడిపోవడానికి గల ఖచ్చితమైన కారణాలు బయటకు రాలేదు. వ్యక్తిగత విభేదాల కారణంగానే ఈ జంట విడాకులు తీసుకున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో హన్సిక చేసిన తాజా పోస్ట్ ఆమె జీవితంలో కొత్త అధ్యాయానికి సంకేతంగా ఉందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

## అనుష్క పెళ్లిపై మళ్లీ ఊహాగానాలు..



హైదరాబాద్ మార్చి 13 ,మన గళం :టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి పెళ్లి విషయంపై మరోసారి సోషల్ మీడియాలో ఊహాగానాలు మొదలయ్యాయి. తన నటన, వ్యక్తిత్వంతో ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన ఈ స్టార్ హీరోయిన్ గురించి గతంలో కూడా పలుమార్లు వివాహ వార్తలు వినిపించాయి. తాజాగా మరోసారి ఆమె పెళ్లి చేసుకోబోతున్నారంటూ నెట్టింట ప్రచారం జోరుగా సాగుతోంది. అనుష్క శెట్టి తన సినీ ప్రయాణాన్ని 'సూపర్' సినిమాతో ప్రారంభించింది. తక్కువ కాలంలోనే టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగి అనేక మంది ప్రముఖ హీరోల సరసన నటించింది. వరుస విజయాలతో ఆమెకు భారీ క్రేజ్ ఏర్పడింది. ఒక సమయంలో తెలుగు సినిమాల్లో అనుష్క లేకుండా పెద్ద సినిమా ఉండదనే స్థాయికి చేరుకుంది. తర్వాత కాలంలో అనుష్క కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను మాత్రమే ఎంచుకుంటూ ముందుకు సాగింది. ముఖ్యంగా 'బాహుబలి ది బిగినింగ్', 'బాహుబలి ది కంక్లూజన్' సినిమాల ద్వారా ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ చిత్రాల విజయంతో దేశవ్యాప్తంగా ఆమెకు అభిమానులు పెరిగారు. గత కొన్నేళ్లుగా అనుష్క సినిమాల సంఖ్యను తగ్గించింది. సంవత్సరానికి ఒకటి లేదా రెండు సినిమాల్లో మాత్రమే నటిస్తూ కెరీర్‌ను కొనసాగిస్తోంది. ఇదే సమయంలో ఆమె వ్యక్తిగత జీవితంపై కూడా తరచూ పుకార్లు వినిపిస్తున్నాయి. గతంలో అనుష్క ఒక డాక్టర్‌ను పెళ్లి చేసుకోబోతుందనే వార్తలు వినిపించాయి. అలాగే ఒక స్టార్ హీరోతో ఆమె వివాహం జరగబోతుందనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఆ వార్తలన్నింటికీ ఎప్పుడూ అధికారిక ధృవీకరణ రాలేదు. ఇప్పుడు తాజాగా మరోసారి అనుష్క వివాహం గురించి వార్తలు వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఆమె వయసు 44 సంవత్సరాలు కాగా, కుటుంబ సభ్యుల ఒత్తిడి పెరగడంతో పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కుటుంబానికి దగ్గర బంధువైన ఒక వ్యాపారవేత్తతో ఆమె వివాహం జరగబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఇరు కుటుంబాల మధ్య అంగీకారం కూడా జరిగిందని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల కాలంలో అనుష్క సినిమాలకు కొంత దూరంగా ఉంటూ వ్యక్తిగత జీవితంపై ఎక్కువగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈ వార్తలపై అనుష్క లేదా ఆమె కుటుంబ సభ్యుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ వార్తలు నిజమా కాదా అన్న విషయంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

## రూ.50 కోట్ల క్లబ్‌లో 'తాయ్ కిళవి'..




చెన్నై మార్చి 13 ,మన గళం : తమిళ సినీ పరిశ్రమలో సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన 'తాయ్ కిళవి' సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. విడుదలైన కేవలం 10 రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.50 కోట్ల వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా 63 ఏళ్ల వయసులో రాధికా ఒక శక్తివంతమైన పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. శివకుమార్ మురుగేసన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ప్రముఖ నటుడు శివకార్తికేయన్ నిర్మించారు. కేవలం రూ.9 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా ఇప్పటికే పెట్టిన పెట్టుబడికి ఐదు రెట్లు వసూళ్లు సాధించి భారీ లాభాలను అందిస్తోంది. సినిమాలో రాధికా 'పావునుతాయ్' అనే కఠిన స్వభావం గల వడ్డీ వ్యాపారిగా కనిపిస్తుంది. తన సంపాదించిన ఆస్తి కోసం పాకులాడే తన కొడుకులకే ఎదురు నిలిచే ఒక శక్తివంతమైన మహిళ పాత్రలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కథలోని భావోద్వేగాలు, కుటుంబ సంబంధాలు మరియు సమాజంలోని కొన్ని వాస్తవాలను చూపించిన తీరు సినిమాకు ప్రధాన బలంగా మారాయి. ప్రస్తుతం తమిళనాడుతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. పెద్ద స్టార్ హీరోలు లేకపోయినా కేవలం కథ బలం, రాధికా నటనతోనే సినిమా భారీ విజయాన్ని సాధించడం విశేషంగా మారింది. ఈ విజయంపై స్పందించిన రాధికా శరత్‌కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హీరోల సినిమాల మాదిరిగా ఈ సినిమాకు కూడా అధిక టికెట్ ధరలు ఉండి ఉంటే ఈ చిత్రం ఇప్పటికే రూ.100 కోట్ల వసూళ్లు సాధించేదని అన్నారు. ప్రేక్షకులు సినిమాను ఇంతగా ఆదరించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతున్న 'తాయ్ కిళవి' సినిమా మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. 63 ఏళ్ల వయసులో కూడా తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ రాధికా శరత్‌కుమార్ మరోసారి తన ప్రతిభను నిరూపించుకున్నారు.

## రామ్ చరణ్ బర్త్‌డేకు డబుల్ ధమాకా..



హైదరాబాద్ మార్చి 13 ,మన గళం : మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులకు ఈ ఏడాది మార్చి నెల ప్రత్యేకంగా మారబోతోంది. ముఖ్యంగా మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు వరుస సర్ప్రైజ్‌లు ఇవ్వాలని చిత్ర బృందాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. 'రంగస్థలం' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న రామ్ చరణ్ సుకుమార్ కాంబినేషన్ మళ్లీ '=జ17' ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల 'పుష్ప' సిరీస్‌తో సంచలన విజయాన్ని సాధించిన దర్శకుడు సుకుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా '=జ17' సినిమాకు సంబంధించిన ప్రత్యేక అప్‌డేట్ ఇవ్వడానికి మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేసే అవకాశం ఉందని, అలాగే సినిమా షూటింగ్ ఎప్పుడు ప్రారంభం కానుందో కూడా ప్రకటించే అవకాశముందని సమాచారం. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని, సుకుమార్ ఒక బలమైన కథను సిద్ధం చేసినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక మరోవైపు దర్శకుడు బుచ్చిబాబు సన దర్శకత్వంలో రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా కూడా ప్రస్తుతం చివరి దశ షూటింగ్‌లో ఉంది. పీరియడ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన 'చికిరి చికిరి' పాట మరియు గ్లింప్స్ ప్రేక్షకుల నుంచి మంచి స్పందన పొందాయి. ఈ నేపథ్యంలో రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 'పెద్ది' సినిమా టీజర్‌ను విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే అభిమానులకు డబుల్ ట్రీట్ లభించే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

# ధోనీకి ఇదే చివరి ఐపీఎల్ కావొచ్చు: ఇర్ఫాన్ పఠాన్

ముంబై, మార్చి 13 ,మన గళం : చెన్నై సూపర్ కింగ్స్ జట్టు దిగ్గజ ఆటగాడు, వికెట్ కీపర్ బ్యాటర్ మహేంద్ర సింగ్ ధోనీకి రాబోయే ఐపీఎల్ సీజనే చివరిది కావొచ్చని భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. చెన్నై జట్టుకు ధోనీ ఎంతో ముఖ్యమని, అతను లేకుండా చెన్నై సూపర్ కింగ్స్‌ను గానీ ఐపీఎల్‌ను గానీ ఊహించుకోవడం చాలా కష్టమని పేర్కొన్నాడు. జియో హాట్‌స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇర్ఫాన్ పఠాన్ మాట్లాడుతూ ఈ సీజన్‌లోనే అభిమానులు ధోనీని చివరిసారిగా పసుపు జెర్సీలో చూడవచ్చని సూచించాడు. జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో ధోనీ ఉనికి ఆటగాళ్లకు ఎంతో ప్రేరణనిస్తుందని తెలిపాడు. ప్రస్తుతం రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, భవిష్యత్తు కోసం యువ ఆటగాళ్లను తయారు చేయడంలో ధోనీ పాత్ర కీలకమని ఆయన అభిప్రాయపడ్డాడు. ధోనీ ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడో ఖచ్చితంగా చెప్పలేనప్పటికీ జట్టును ఐక్యంగా ఉంచడంలో అతని నాయకత్వం ఎంతో ఉపయోగపడుతుందని ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు. ధోనీ ఫిట్‌నెస్, పనిభారం వంటి అంశాలపై చెన్నై జట్టు యాజమాన్యం జాగ్రత్తగా వ్యవహరిస్తుందని తెలిపాడు. ఈ సీజన్‌లో ఆరోసారి ఐపీఎల్ టైటిల్ గెలిచి తమ అభిమాన ఆటగాడికి ఘనంగా వీడ్కోలు పలకాలనే లక్ష్యంతో జట్టు ముందుకు సాగుతోందని కూడా పేర్కొన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు సార్లు ఐపీఎల్ టైటిల్ అందించిన ధోనీ ప్రస్తుతం కూడా జట్టు నాయకత్వ



బృందంలో కీలక సభ్యుడిగా కొనసాగుతున్నాడు. అయితే గత సీజన్‌లో చెన్నై జట్టు ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయలేకపోయింది. పద్నాలుగు మ్యాచ్‌లు ఆడిన జట్టు కేవలం నాలుగు విజయాలు మాత్రమే సాధించి పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. ఐపీఎల్ చరిత్రలో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా గుర్తింపు పొందిన ధోనీ ఇప్పటివరకు మొత్తం 278 మ్యాచ్‌లు ఆడి 38.80 సగటుతో 5,439 పరుగులు నమోదు చేశాడు. అతని నాయకత్వం, అనుభవం చెన్నై జట్టుకు ఇప్పటికీ ప్రధాన బలంగా నిలుస్తున్నాయి.

# భారత్‌లో క్రికెట్ భావోద్వేగం..





అహ్మదాబాద్, మార్చి 13,మన గళం : భారత క్రికెట్ జట్టు ప్రపంచకప్ విజయాన్ని అభిమానులకే అంకితం చేస్తున్నట్టు జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రపంచకప్ గెలిచిన తర్వాత మైదానంలో కొందరు ఆటగాళ్లు తమ ప్రియురాళ్లతో సంబరాలు చేసుకోవడంపై చర్చ జరుగుతున్న వేళ, ఈ విజయంలో అభిమానుల పాత్ర ఎంతో గొప్పదని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో క్రికెట్ కేవలం ఒక ఆట మాత్రమే కాకుండా ప్రజల భావోద్వేగమని, అందుకే ఈ విజయం దేశంలోని ప్రతి ఒక్కరిదని సూర్యకుమార్ స్పష్టం చేశారు. మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ క్రీడా మైదానంలో జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించిన భారత జట్టు వరుసగా రెండోసారి పొట్టి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. సొంతగడ్డపై ఈ ట్రోఫీని గెలిచిన తొలి ఆతిథ్య జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది. సారథిగా దేశానికి ప్రపంచకప్ అందించిన ఆటగాళ్ల జాబితాలో సూర్యకుమార్ యాదవ్ కూడా స్థానం సంపాదించాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ట్రోఫీని నిలబెట్టుకున్న తొలి జట్టుగా భారత జట్టు గుర్తింపు పొందడంలో ఆయన కీలక పాత్ర పోషించాడు. ఈ సందర్భంగా అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సూర్యకుమార్ ఒక సందేశాన్ని పంచుకున్నారు. “ప్రియమైన భారత జట్టు అభిమానులారా.. ముందుగా మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీ మద్దతు, ఆశీర్వాదం వల్లనే మేము ఈ స్థాయికి చేరుకున్నాం. ఈ ప్రపంచకప్ ట్రోఫీ మొత్తం దేశానిదే. మేము గెలిచినా ఇది మా ఒక్కరి విజయమే కాదు. బ్యాట్ పట్టుకుని ప్రపంచకప్ గెలవాలని కలలు కనే ప్రతి చిన్నారి కల ఇందులో భాగమైంది. స్టేడియానికి వచ్చి మమ్మల్ని ప్రోత్సహించిన అభిమానులు, ఇంటి వద్ద నుంచి మాకు మద్దతుగా నిలిచిన లక్షలాది మంది ఈ విజయానికి కారణం” అని ఆయన పేర్కొన్నారు. అభిమానుల ప్రార్థనలు, ప్రేమ తమకు అపారమైన ప్రేరణనిచ్చాయని, అదే బలంతో జట్టు ఈ ఘనత సాధించిందని సూర్యకుమార్ తెలిపారు. భారత్‌లో క్రికెట్ ప్రజల హృదయాలకు దగ్గరైన ఆట అని, అందుకే ప్రపంచకప్ విజయం ప్రతి భారతీయుడి ఆనందంగా మారిందని ఆయన అన్నారు.


# ఆటో డ్రైవర్ కుమారుడు నుంచి టీమిండియా పేస్ అస్త్రం వరకు సిరాజ్ ప్రయాణం




హైదరాబాద్, మార్చి 13 ,మన గళం : హైదరాబాద్ గల్లీల్లో టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడుతూ ఎదిగిన మహమ్మద్ సిరాజ్ ప్రస్తుతం భారత క్రికెట్ జట్టులో కీలక పేసర్‌గా గుర్తింపు పొందాడు. ఆటో డ్రైవర్ కుమారుడిగా పేదరికంలో పెరిగిన ఈ స్పీడ్ బౌలర్ తన కష్టపడి సాధించిన విజయాలతో టీమిండియాకు గెలుపు గుర్రంగా నిలుస్తున్నాడు. తాజాగా ఓవల్ టెస్టులో అద్భుత ప్రదర్శనతో క్రికెట్ దిగ్గజాల ప్రశంసలు అందుకున్న సిరాజ్ శుక్రవారం తన ముప్పై రెండో పుట్టినరోజును జరుపుకుంటున్నాడు. ఈ సందర్భంగా అభిమానులు, క్రికెట్ ప్రముఖులు అతనికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

ముస్లిం కుటుంబంలో 1994లో జన్మించిన సిరాజ్ చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తి చూపేవాడు. చదువుకంటే క్రికెట్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టేవాడని కుటుంబ సభ్యులు చెబుతుంటారు. తండ్రి మహమ్మద్ గౌస్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవారు. చిన్నతనంలో స్నేహితులతో కలిసి టెన్నిస్ బాల్‌తో క్రికెట్ ఆడిన సిరాజ్ 19 ఏళ్ల వయసులో లెదర్ బాల్‌తో బౌలింగ్ ప్రారంభించాడు. వేగంగా బంతులు విసరడంలో ప్రతిభ చూపిన అతను జూనియర్ స్థాయి పోటీల్లోనే మంచి గుర్తింపు సంపాదించాడు. హైదరాబాద్ మాజీ కోచ్ భరత్ అరుణ్ దృష్టిలో పడిన తర్వాత సిరాజ్ బౌలింగ్ మరింత పదునెక్కింది. హైదరాబాద్ రంజీ జట్టులో స్థానం సంపాదించిన అతను తర్వాత దేశీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌లోనూ తన ప్రతిభను చాటుకున్నాడు. ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు వేగం, స్వింగ్ కలిపి బౌలింగ్ చేయడం అతని ప్రత్యేకతగా మారింది. గంటకు నూట నలభై కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు విసరడం, రెండు వైపులా స్వింగ్ చేయడం వల్ల ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందులకు గురి చేస్తాడు. ఇంగ్లండ్ పర్యటనలో సిరాజ్ ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో భారత పేస్ దళాన్ని నడిపించిన అతను ఓవల్ టెస్టులో రెండో ఇన్నింగ్స్‌లో అద్భుత బౌలింగ్ చేసి మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అలాగే స్వదేశంలో వెస్టిండీస్‌పై జరిగిన తొలి టెస్టులో ఏడు వికెట్లు తీసి జట్టుకు ఘన విజయం అందించాడు. దీంతో సొంతగడ్డపై టెస్టులో ఐదు కంటే ఎక్కువ వికెట్లు సాధించిన పేసర్‌గా నిలిచాడు. ఆసియా కప్ ఫైనల్లో శ్రీలంకపై సిరాజ్ సంచలన ప్రదర్శన మరువలేనిది. ఒకే ఓవర్లో నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును కుదేలు చేశాడు. అదే మ్యాచ్‌లో ఆరు వికెట్లు పడగొట్టి తన కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలను నమోదు చేశాడు. ఆ ప్రదర్శనతో ప్రపంచ క్రికెట్‌లో తన ప్రత్యేకతను మరోసారి నిరూపించాడు. ప్రస్తుతం టెస్టు క్రికెట్‌లో భారత జట్టు ఆధారపడదగ్గ బౌలర్‌గా సిరాజ్ ఎదిగాడు. ప్రధాన పేసర్ బుమ్రా అందుబాటులో లేని సందర్భాల్లో బౌలింగ్ దళాన్ని సమర్థంగా నడిపిస్తున్నాడు. అలుపెరగని శ్రమతో సుదీర్ఘ స్పెల్స్ వేసే సామర్థ్యం అతనిలో ప్రత్యేకంగా కనిపిస్తుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 202527 చక్రంలో కూడా అతను కీలక పాత్ర పోషిస్తూ తన బౌలింగ్‌తో అభిమానులను అలరిస్తున్నాడు. తన అద్భుత ప్రదర్శనలకు గుర్తింపుగా అంతర్జాతీయ క్రికెట్ మండలి నుంచి నెల ఉత్తమ ఆటగాడి అవార్డును కూడా అందుకున్నాడు.

# కావ్య మారన్‌పై నెటిజన్ల ఆగ్రహం..



న్యూఢిల్లీ, మార్చి 13,మనగళం : ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్‌పై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విదేశీ లీగ్ అయినప్పటికీ పాకిస్థాన్‌కు చెందిన క్రికెటర్‌ను కొనుగోలు చేసినందుకు ఆమెపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ‘బాయ్‌కాట్ సన్‌రైజర్స్’ అనే హ్యాష్‌ట్యాగ్ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారి తీసింది.ఇంగ్లాండ్‌లో నిర్వహించే ది హండ్రెడ్ లీగ్ వేలంలో పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు కొనుగోలు చేయడం ఈ వివాదానికి కారణమైంది. వేలంలో అబ్రార్ అహ్మద్‌ను ఒక లక్ష తొంభై వేల యూరోల ధరకు, అంటే భారత కరెన్సీలో సుమారు రూ.2.34 కోట్లకు ఈ ఫ్రాంచైజీ దక్కించుకుంది. ఈ నిర్ణయంపై కొంతమంది అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేస్తున్నారు.భారత ఫ్రాంచైజీలు పాకిస్థాన్ ఆటగాళ్లను తీసుకోవడం చాలా సంవత్సరాలుగా నిలిచిపోయింది. ఐపీఎల్ ప్రారంభ కాలంలో వసీం అక్రమ్, సొహైల్ తన్వీర్ వంటి కొందరు పాకిస్థాన్ ఆటగాళ్లకు అవకాశాలు లభించినప్పటికీ తరువాత బీసీసీఐ పాకిస్థాన్ క్రికెటర్లకు ఐపీఎల్‌లో అవకాశాలు ఇవ్వలేదు. అయితే విదేశీ లీగ్‌లలో ఫ్రాంచైజీలు స్వతంత్రంగా ఆటగాళ్లను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉండటంతో సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు అబ్రార్ అహ్మద్‌ను తీసుకుంది.ఈ విషయంపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాను సంప్రదించగా, ది హండ్రెడ్ లీగ్ భారత క్రికెట్ బోర్డు నిర్వహించే పోటీ కాదని ఆయన స్పష్టం చేశారు. అది విదేశీ లీగ్ కావడంతో ఫ్రాంచైజీలు తమకు నచ్చిన ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చని, ఈ విషయంలో బీసీసీఐకి ప్రత్యక్ష సంబంధం లేదని పేర్కొన్నారు.ఇటీవల సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ విదేశీ లీగ్‌లలో కూడా అడుగుపెట్టింది. ఇంగ్లాండ్‌లో జరిగే ది హండ్రెడ్ లీగ్‌లో ‘సన్‌రైజర్స్ లీడ్స్’ పేరుతో జట్టును కొనుగోలు చేసింది. తాజా వేలంలో అబ్రార్ అహ్మద్‌ను జట్టులోకి తీసుకోవడంతో ఈ అంశం చర్చకు దారి తీసింది. తనను ఎంపిక చేసినందుకు సన్‌రైజర్స్ లీడ్స్ జట్టుకు, అలాగే కావ్య మారన్‌కు అబ్రార్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది ది హండ్రెడ్ లీగ్‌లో జట్టు విజయానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# ఐపీఎల్ ప్రారంభానికి ముందు ఆర్సీబీకి షాక్



బెంగళూరు, మార్చి 13 ,మన గళం : మార్చి 28 నుంచి ప్రారంభమయ్యే ఐపీఎల్ సీజన్‌కు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ సీజన్ తొలి మ్యాచ్ బెంగళూరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరియు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరగనుంది. టోర్నీ ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్నప్పటికీ ఆర్సీబీ శిబిరంలో కొన్ని అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. జట్టులో కీలక బౌలర్‌గా ఉన్న ఆస్ట్రేలియా పేసర్ జోష్ హేజిల్‌వుడ్ అందుబాటుపై సందిగ్ధత నెలకొంది. అతనికి ఇంకా వైద్య అనుమతి రాకపోవడంతో జట్టుతో కలిసే విషయంలో స్పష్టత లేదు. దీంతో తొలి మ్యాచ్‌కు అతను అందుబాటులో ఉంటాడా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇదే సమయంలో జట్టు శిక్షణా శిబిరం కూడా ఇంకా ప్రారంభం కాలేదు. మరోవైపు బెంగళూరులోని చిన్నస్వామి క్రీడా మైదానం విషయంలో కూడా కొంత అనిశ్చితి కొనసాగుతోంది. గత సంవత్సరం జరిగిన విజయోత్సవ వేడుకల సమయంలో చోటుచేసుకున్న కొన్ని ఘటనల కారణంగా ప్రస్తుతం ఆ మైదానం బోర్డు పర్యవేక్షణలో ఉంది. బోర్డు అధికారులు మైదానాన్ని పూర్తిగా పరిశీలించి అనుమతి ఇచ్చిన తర్వాతే మ్యాచ్‌ల నిర్వహణపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో కూడా కొన్ని ఆందోళనలు ఉన్నాయి. ఆ జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వెన్నునొప్పితో బాధపడుతున్నట్లు సమాచారం. దీంతో అతను టోర్నీలో పూర్తిగా పాల్గొంటాడా లేదా అన్నది ఇంకా స్పష్టత లేదు. అయితే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కొన్ని సానుకూల అంశాలు కూడా ఉన్నాయి. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్ వంటి కీలక ఆటగాళ్లు మంచి ఫామ్‌లో ఉండటం జట్టుకు బలంగా మారింది. అలాగే హర్షల్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, జయదేవ్ ఉనద్కత్ వంటి అనుభవజ్ఞులు జట్టులో ఉండటం మరో ప్లస్‌గా భావిస్తున్నారు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.